# అవి 'నీతి' పనులు

**-ఆదిమధ్యం రామానుజస్వామి**

ఉదయాన్నే తూర్పున సూర్యుడు తన ఏటవాలు కిరణాలతో ఎర్రగా ప్రకాశిస్తున్నాడు. సూర్యకిరణాల పక్కనే ఉన్న చెరువునీటిపై పడి ధగాధగా మెరుస్తున్నాయి. రేడియోలో సుప్రభాతం వినిపిస్తోంది. తూర్పున తెలవారుచున్నది. ఉదయం పూజావేళయ్యింది. నీ కర్తవ్యం నిర్వహించడానికి లేలెమ్ము అని దేవుడికి సుప్రభాతం. మరోప్రక్క మా పనులు మేము ప్రారంభిస్తాం అని మానవాళి తన దినచర్య మొదలుపెట్టింది.

"ఏమోయ్! వెంకటేశూ! రోజురోజుకీ పాలల్లో నీళ్లు పెంచేస్తున్నావు. నీ గేదెలు నీళ్లెక్కువ తాగుతున్నాయా ఏమిటి? ఇలా నువ్వు పాలల్లో నీళ్ల శాతం పెంచుకుంటూ పోతే ఈ నెల నీ పాలకిచ్చే సొమ్ములో ఒక లీటరు తగ్గించి లెక్క కడతాను" అంది బిందు.

"లీటరు పదహారు రూపాయల రకంలో కొంత నీరు తప్పదమ్మా! లీటరు పద్దెనిమిది రూపాయల రకం తీసుకోండి చిక్కగా ఉంటాయి. రేపట్నించి ఆ రకం పాలు పోయమన్నారా?'' పాల వెంకటేశు రొటీన్ డైలాగ్.

"అసలు నాకు తెలీకడుగుతాను. నీ సైకిల్‌కి అన్ని రకాల పాల కేనులు అన్ని వెరైటీల పాలడబ్బాలు ఎందుకయ్యా తగిలిస్తావు. అందరికీ ఒకే రకం పాలు అమ్మవచ్చు కదా! ఆ పద్దెనిమిది రూపాయల రకంలో మాత్రం నీళ్లు కలపవని గారెంటీ ఏమిటి?'' అంటూ వెంకటేశు సమాధానానికి ఎదురు చూడకుండా వంటగదిలోకి గబగబా నడిచింది బిందు.

బిందు రోజూ ఈ మాటలనడం వాడికి మామూలే. ఆమె మాటలు పూర్తిగా వినీ వినకుండానే సైకిలెక్కి రయ్‌మని మరో ఇంటికి పరుగు తీస్తాడు వెంకటేశు.

వెంకటేశు సైకిల్‌కి వెనుక రెండు పక్కలా రెండు రకాల పెద్ద పాలకేనులు తగిలించి ఉంటాయి. ఒక కేన్‌లో పదహారు రూపాయల రకం, మరో కేన్‌లో పద్దెనిమిది రూపాయల రకం పాలు ఉంటాయి. గిరాకీని బట్టి నీళ్లు కలుపుకోవడానికి వీలుగా ఒక నీళ్ల కాన్ హాండిల్ బార్‌కి తగిలించి ఉంటుంది. పాలల్లో నీళ్లు రోజూ రొటీన్‌గా కలుపుతుంటాడు వెంకటేశు.

గిరాకీ మరీ పెరిగితే చవకరకం డైరీపాల పేకెట్లు ఓ రెండు కొని కలుపుతుంటాడు కూడా. ఇది పాల వెంకటేశు నీతి.

"పేపర్... పేపర్!'' అంటూ పేపర్ బాయ్ న్యూస్‌పేపరు విసిరాడు. పేపర్ రయ్‌మంటూ వచ్చి హాలులో పడింది. దాన్ని తీయడానికి వాసు ఇంకా నిద్రలేవలేదు. బిందు వంటింట్లో అంట్లు తోముకునే పనిలో నిమగ్నమై ఉంది.

కొంతసేపటికి వాసు నిద్రముఖంతో బెడ్‌రూములోంచి హాలులోకి వస్తూ సోఫాలో చతికిలపడ్డాడు.

గుమ్మంలో కింద పడి ఉన్న పేపర్ మడతలు విప్పుతూ 'ఒసేవ్! బిందూ! పేపర్‌వాడు పేపరులో సిటీ ఎడిషన్ పెట్టలేదే? మెయిన్ పేపరు మాత్రమే ఉంది. నువ్వు పేపరు చూడలేదా?''

"నా మొహానికి పేపరు చూడ్డం కూడానా? నాకంత టైమెక్కడిది? ఇంటి పనితోనే వేగలేక చస్తున్నాను. టైము తొమ్మిది కావస్తుంది. త్వరగా వంట చేసి మీకు కారేజీ రెడీ చేయాలిగా. నేను పేపరు వాడ్ని గమనించలేదు. రేపు ఉదయం వాడ్ని పట్టుకుని విషయం కనుక్కుంటాలెండి. చివరికి పేపరు బాయ్స్ కూడా ఇటువంటి దగాలు చేస్తున్నారన్న మాట. ఆ సిటీ ఎడిషన్లు వేరేగా ఎవర్కైనా అమ్ముకుంటున్నారేమో?''

వాసు పేపర్ని ఒకసారి తిరగేసి, టూత్‌బ్రెష్ నోట్లో పెట్టుకుంటూ బాత్‌రూమ్‌కి వెళ్లాడు. స్నానపానాలు ముగించి వాసు ఆఫీసుకి బస్సులో బయలుదేరాడు.

★★★

"లక్డీకాపూల్‌కి ఒక టికెట్''

"చిల్లరుంటే ఇవ్వండి సార్! ఎంతమందికని చిల్లరివ్వగలను?''

"ఎనిమిది రూపాయల బస్ టికెట్‌కి పది రూపాయలిస్తే కూడా ఇంకా చిల్లర తెమ్మంటే ఎట్లాగయ్యా. రెండు రూపాయలు చిల్లరివ్వడానికి కూడా విసుక్కుంటే ఎట్లా? కండక్టర్‌గా నీ దగ్గర కొంత చిల్లరంటూ ఉండాలిగా. చిల్లర కొంత ఉంచుకుని డ్యూటీ ఎక్కడం నీ ఉద్యోగ ధర్మం కదా!''

"నాకు క్లాసులు పీక్కండి సార్! టిక్కెట్టుకు సరిపడా చిల్లరిచ్చి కండక్టర్‌తో సహకరించండి. పైన తాటికాయంత అక్షరాలతో రాసి ఉంది చూడండి. నా దగ్గర చిల్లరుంటే ఇవ్వనా? ఆగండి టిక్కెట్ వెనకాల రాస్తాను. లక్డీకాపూల్ స్టాపు వచ్చాక చిల్లరడిగి తీసుకోండి.''

వాసు విసుక్కుంటూ టిక్కెట్ తీసుకుని తన జేబులో పెట్టుకున్నాడు. కానీ బస్ దిగి ఆఫీసు చేరేక గుర్తుకొచ్చింది చిల్లర సంగతి. వాసు చిల్లర తీసుకోవడం మరచినా, చిల్లర ఇవ్వవలసిన బాధ్యత కండక్టర్‌పై ఉంది కదా. ఏంటో మాయ లోకం అనుకుంటూ ఆఫీసు చేరి ఆఫీసు పనిలో బుర్రదూర్చాడు వాసు. ఇది కండక్టర్ నీతి.

★★★


ఆఫీసులో వాసుది మెడికల్ బిల్స్ పాస్ చేసే సీటు. ఉదయం నుండి సాయంత్రం వరకూ చచ్చేంత పని ఉంటుంది.

ప్రభుత్వోద్యోగుల చికిత్సకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులిచ్చే బిల్లులు గత పదేళ్లుగా పాస్ చేస్తూ తను గ్రహించిందేంటంటే... ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల.వాళ్లు చిన్న చిన్న రోగాలకి కూడా రకరకాల టెస్టులంటూ వేలకు వేలు బిల్లులివ్వడం. ఆ బిల్లులను ప్రశ్నించ

లేక తప్పనిసరి పరిస్థతుల్లో పాస్ చేయడం. మామూలు జ్వరానికి ఫలానా టెస్టులు తప్పనిసరి అని డాక్టరంటే, ఈ జ్వరానికి అన్ని టెస్టులు అవసరమా? అనే ధైర్యం ఏ రోగికి మాత్రం ఉంటుంది? ఒక హార్ట్ పేషెంట్ బిల్లు లక్షా యాభైవేలకి వచ్చింది.

రోగికి రెండు 'స్టెంట్'లు వేశామని ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వాళ్లు బిల్లు ఇచ్చారు. తీరా రోగిని ప్రశ్నించాక తెలిసిన నిజం ఏమిటంటే రోగికి ఒక 'స్టెంట్' వేశారట. ఒక్కొక్క 'స్టెంట్' విలువ అరవై వేల రూపాయలు. ఒక్క రోగి దగ్గరే అరవై వేలయితే ఇలా ఎంతమంది రోగులో... ఎన్ని అరవై వేలో... ఎన్ని 'స్టెంట్'లో... ప్రభుత్వోద్యోగి అని తెలిస్తే చాలు ఎన్ని టెస్టులయినా చేస్తారు, ఎన్ని 'స్టెంట్'లయినా వేస్తారు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు. ప్రభుత్వమే డబ్బు కట్టుకుంటోంది కదా!

నా జేబు నుంచీ పోయేదేముందని ప్రభుత్వోద్యోగి మౌనం వహిస్తాడు. ఒకవేళ ప్రశ్నిస్తే డాక్టర్ల నిర్లక్ష్యానికి గురవుతాడు, నష్టపోతాడు. ఇది ప్రైవేటు ఆసుపత్రుల నీతి.



సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది. ఆఫీసు పని ముగించుకుని ఉసూరుమంటూ లక్డీకాపూల్ బస్టాప్ చేరాడు వాసు. బస్సులో ఇల్లు చేరడానికి దాదాపు గంట సమయం పడుతుంది.

బస్సులో అదృష్టవశాత్తు సీటు దొరికింది. సీటులో చతికిలపడి ముప్పై సంవత్సరాలు గడిచిన తన సంసార జీవితంలోకి తొంగిచూశాడు. తరంగాల్లా వస్తున్న ఆలోచనలకి అడ్డుకట్ట వేయలేకపోయాడు. ఇంకో రెండు సంవత్సరాలలో రిటైర్ కాబోతున్నాడు. తన పోస్ట్ రిటైర్మెంటు జీవితం గూర్చి ఆలోచనలో పడ్డాడు.

ప్రావిడెంటుఫండ్‌లో ఉన్న సొమ్మంతా ఖాళీ చేసి, చిన్నా చితకా అప్పులు చేసి తన ఇద్దరు కొడుకుల్ని ఇంజనీర్లను చేశాడు. వాళ్లిద్దరూ విదేశాల్లో ఉద్యోగాలు సంపాదించుకుని పెళ్లిళ్లయ్యాక అక్కడే స్థిరపడ్డారు. వాసు, బిందు తమ పిల్లలు వారి కళ్ల ఎదుటే ఉండి వారితో కలిసిమెలసి పిల్లాపాపలతో వారితోనే ఉంటూ చేదోడువాదోడుగా ఉంటారని కలలు గన్నారు. కానీ వాస్తవానికి అలా జరగలేదు. ఈనాడు పిల్లలకి రెక్కలొచ్చాక వాళ్లు తల్లిదండ్రుల గురించి, వాళ్ల అవసరాల గురించి ఆలోచించే స్థితిలో లేరు. వాళ్ల అవసరాలు వాళ్లవి. వాళ్ల ఆలోచనలు వాళ్లవి.

వాసుకీ బిందుకీ పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారన్న తృప్తేగానీ, వార్ధక్యంలో వారి సేవలందుకునే భాగ్యం లేదు. మనుమలు, మనుమరాళ్లు పుట్టినప్పుడు పురుళ్లు పోయడానికి వాళ్లనొక ఆర్నెల్లు పెంచడానికి 'విజిటింగ్ వీసా' దొరుకుతుందే కానీ, వారి ప్రేమాభిమానాలను కలకాలం పంచుకునే అవకాశమే లేదు. వారితో కొన్ని క్షణాలు గడిపిన మధురానుభూతులు స్మరించుకోడం తప్ప. 'మా మనుమడు అమెరికాలో ఉన్నాడు', 'మా మనుమరాలు అమెరికాలో సంగీతం నాట్యం నేర్చుకుంటోంది' అని ఫోటోలు చూస్తూ ఇరుగుపొరుగువారికి చూపిస్తూ మురిసిపోతుంటారుగాని వాళ్ల ప్రేమాభిమానాలకు నోచుకోరు. వాళ్లతో జీవితంలో చివరి దశ గడపనూ లేరు. గడిపే అవకాశం కూడా లేదు. వాళ్లతో కొద్దిరోజులు గడుపుదామన్నా ఎంతో ఖర్చుతో కూడిన పని.

తల్లిదండ్రులు వాళ్ల జీవితాలను ఫణంగా పెట్టి పిల్లలను ఖరీదైన పెద్ద చదువులు చదివించి వాళ్లకు బంగారు బాట వేసినదానికి ఫలితం... చివరిదశలో తల్లిదండ్రులకూ ఒంటరితనం. ఏ అవాంతరం, అనారోగ్యం వచ్చినా భర్తకి భార్య, భార్యకి భర్త తప్ప వేరే దిక్కులేదు. తల్లిదండ్రులను వాళ్ల ఖర్మానికి వాళ్ల నొదిలి విదేశాల్లో స్థిరపడి పోవడం ఎంతవరకు న్యాయం? స్వదేశంలో స్థిరపడి, ముసలితనంలో వాళ్లని కనిపెట్టుకుని వారికి చేదోడువాదోడుగా ఉండవలసిన బాధ్యత పిల్లలపై లేదా?

తల్లిదండ్రుల క్షేమం కంటే డాలర్ల సంపాదనే ముఖ్యమా? డాలర్ల గురించి ఈ పరుగులెందుకు? ఇలా రకరకాలుగా వాసు ఆలోచనలు పరుగెడుతుండగా వాసు దిగవలసిన స్టాప్ రానే వచ్చింది. ఇది తల్లిదండ్రుల పట్ల పిల్లల నీతి.

తన దినచర్యలో ఆ రోజు జరిగిన సంఘటనలన్నిటినీ తలుచుకుంటూ అలసిసొలసి ఇల్లు చేరాడు వాసు.

భోజనం ముగించి ఆ రోజు పేపరు చదువుతూ పక్కపై నడుం వాల్చాడు. బిందు వంటింట్లో తన పనంతా ముగించుకొని మర్నాడు టిఫిన్ బాక్స్‌కి కావల్సిన ఏర్పాట్లన్నీ చేసి పతి చెంతకు చేరింది.

"ఏమండీ! సంక్రాంతి పండుగ వస్తుంది. పండక్కి నాకు నెక్లెస్ కొంటానన్నారు, కొంటున్నారా?"

మౌనంగా ఏ సమాధానం ఇవ్వకుండా పేపరు చదవడంలో నిమగ్నమయ్యాడు వాసు.

"మిమ్మల్నే అడుగుతుంట. ఈసారి పండక్కి ముత్యాల నెక్లెస్ తప్పకుండా కొనాలి. నెక్లెస్ కొంటేనే పూర్తి భోజనం. లేకపోతే పస్తే" అంటూ పక్కపై మరో పక్క తిరిగిపడుకుంది బిందు. ఇది సతి నీతి.

***


వాసు మరదలు కొడుకు సాయి అయిదేళ్ల వాడు. ఒకటవ తరగతి తెలుగు వాచకం చదువుతూ ఒక కథలో ఏదో సందేహమొచ్చి వాసు దగ్గరకు చేరి వాడి ముద్దుముద్దు మాటలలో అడిగాడు.

"పెద్దనాన్నా! పెద్దనాన్నా! 'నీతి' అంటే ఏమిటి?" అని.

ఈ రోజుల్లో ఎక్కడా కనిపించని 'నీతి'ని నిర్వచించాలో లేదా నేడు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా నడుస్తున్న 'అవినీతి'నే 'నీతి' అని వాడికి బోధించాలో అర్థంకాక సందిగ్ధంలో పడ్డాడు వాసు.

అవును నిజమే! 'అవినీతి'లోనే 'నీతి' ఉందని. తన దినచర్యలో తాను ఎదుర్కొన్నవి, అనుభవించినవి... అవే 'నీతి' పనులని ఆలోచిస్తూ భావి భారత పౌరుడు అయిన వాడికి నీతి గురించి ఏమీ చెప్పలేక వాడి ప్రశ్నకి జవాబు చెప్పకుండానే, ఒక చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు వాసు.

★



## నేను సైతం...!

ఈమధ్యనే జూనియర్ ఎన్టీఆర్ తన బరువుని దాదాపు 30 కిలోల వరకు తగ్గించుకుని 'యమదొంగ' సినిమాలో స్లిమ్‌గా కనిపించాడు! ఇప్పుడు అతను నటిస్తున్న కొత్తచిత్రం 'కంత్రీ'లో హీరోయిన్‌గా నటిస్తున్న ముంబాయి చిన్నది హంసిక కూడా తన బరువు తగ్గించుకుని ఈ సినిమాలో నటించడానికి రెడీ అయిందిట. 'దేశముదురు'లో కొంచెం బొద్దుగానే వున్న హంసిక 'కంత్రీ'లో స్లిమ్‌గా కనిపించబోతోందన్నమాట.

